## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



దుబ్బాక పట్టణం ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠ్యాంశాలు బోధించారు. డీఈఓగా మాధవ్, ఎంఈఓగా మనుశ్రీ, ప్రధానోపాధ్యాయురాలిగా కీర్తన, తదితర విద్యార్థులు ఉపాధ్యాయులుగా ఒకరోజు విధులు నిర్వర్తించారు. హెచ్ఎం నక్కుబాయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. -దుబ్బాకటౌన్



సిద్దిపేట మండలం గుర్రాలగొంది గ్రామ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కల్యాణి, ఉపాధ్యాయులు వాణి, శ్యామల, రాజేశ్వర్, భార్గవ్, మౌనిక తదితరులు పాల్గొన్నారు. - సిద్దిపేటరూరల్



నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్ మండలాల పరిధిలోని రాఘవాపూర్ తదితర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. - సిద్దిపేటరూరల్



చిన్నకోడూరు మండలం కమ్మర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఎంఈఓగా దివ్య, హెచ్ఎంగా వర్ష, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నర్సింహచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - చిన్నకోడూరు(సిద్దిపేట)

## క్లుప్తంగా

### ఎఫ్టీఎల్, బఫర్ జోన్ గుర్తించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న మహేష్

**చేర్యాల(సిద్దిపేట):** మండల పరిధి నాగపురి గ్రామ శివారులో ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధి నిర్ధారించాలంటూ నల్లపోచమ్మ ఆలయ చైర్మన్ గూడెపు మహేశ్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సమీర్ అహ్మద్‌కు వినతి పత్రం అందించారు. నల్లపోచమ్మ ఆలయ భూమి 30 గుంటలు, నల్లపోచమ్మ చెరువు శిఖం 22 ఎకరాల 2 గుంటల విస్తీర్ణాన్ని గుర్తించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

### నాటు సారా పట్టివేత

**మద్దూరు(హుస్నాబాద్):** గాగ్గిళ్లాపూర్ గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తూ పోలీసులు నాటు సారాను పట్టుకున్నారు. చేర్యాల ఎక్సైజ్ ఎస్ఐ సురేశ్ కథనం మేరకు.. గాగ్గిళ్లాపూర్ గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కొమురవెల్లి మండలానికి చెందిన ఇద్దరు కారులో అక్రమంగా ఏడు లీటర్ల నాటు సారా తరలిస్తున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఈ కేసులో దూల్మిట్ట మండలంలోని చర్చ్ తండాకు చెందిన వ్యక్తి పరారీలో ఉన్నాడని ఎక్సైజ్ ఎస్ఐ తెలిపారు.

### ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

**చేర్యాల(సిద్దిపేట):** త్వరలో జరిగే స్థానిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని చుంచనకోట గ్రామస్తులకు ఎస్ఐ నీరేష్ సూచించారు. బుధవారం గ్రామాన్ని సందర్శించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో గొడవలకు దిగవద్దన్నారు. ప్రజల రక్షణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు అవసరం అన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు బానిన కావొద్దని, గ్రామంలో బెల్టు షాపులు నడపవద్దని సూచించారు.

### 21 నుంచి ఎస్ఎఫ్ఐ సభలు

**చేర్యాల(సిద్దిపేట):** సిద్దిపేటలో ఈనెల 21వ తేదీన జరగనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా 6వ మహాసభలకు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ చేర్యాల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మైసంపల్లి రాహుల్, తాడూరి భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలో విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు.

### విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** పట్టణంలోని 11కేవీ హౌసింగ్ బోర్డు కాలనీ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా లైన్‌ల కింద చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా హౌసింగ్‌బోర్డు కాలనీ, హరిప్రియనగర్, టీచర్స్ కాలనీ, ఎస్ఆర్ నగర్, ఎంఎల్ఏ క్యాంప్ ఆఫీస్, ప్రియదర్శిని కాలనీ, మీనాక్షి కాలనీ ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

### ముందస్తు అరెస్ట్

**హుస్నాబాద్:** రాష్ట్ర మున్నూరు కాపు సంఘం పిలుపు మేరకు సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడి కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మున్నూరు కాపు కులస్తులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణనలో బీసీల రిజర్వేషన్, మున్నూరు కాపు జనాభాను తగ్గించి చూపెట్టారని ఆరోపించారు. బీసీల కులగణను రీ సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, సంఘ నాయకులు పెరుక భాగ్యరెడ్డి, బొలిశెట్టి సుధాకర్, సమ్మయ్య, గొంటి రాజు, పిల్లి తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం

- అవగాహన కల్పించినా కానరాని ఫలితం
- దుబ్బాకలో కుప్పలు కుప్పలుగా దర్శనం
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్



మున్సిపల్ చెత్తలో అధికంగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు

**దుబ్బాకటౌన్:** పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి పెను ముప్పుగా మారింది. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా ఫలితం కానరావడంలేదు. ఇప్పటికే జూట్ సంచులు, జనుపనార సంచుల వినియోగంపై ఆసక్తి చూపడంలేదు. చిన్న చిన్న వస్తువులు కొన్నా ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో స్టీలు, పేపర్, జూట్, జనుపనార లాంటి ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం ప్రోత్సహిస్తే ప్లాస్టిక్ నిర్మూలనకు బీజం పడుతుంది. ప్లాస్టిక్ వల్ల పర్యావరణంతో పాటు మానవుల, పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కరగడానికి దాదాపు వందల ఏళ్ల సమయం పడుతుందన్న విషయం అందరికీ విదితమే. కానీ దుబ్బాక మున్సిపల్ పరిధిలో రోజూ సేకరించే చెత్తలో అధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలు లభ్యం కావడం కలవర పెట్టే విషయం. దుబ్బాకలో కిరాణ దుకాణాల నుంచి మొదలు, మటన్, చికెన్, కూరగాయల విక్రయదారులు ప్లాస్టిక్ కవర్లను విరివిగా వాడుతున్నారు.

**అధికారులు చర్యలు తీసుకున్నా..**

ప్లాస్టిక్‌పై అధికారులు తనిఖీలు చేపట్టి నోటీసులు అందిస్తున్నా దుకాణాదారుల వైఖరి మాత్రం మారడం లేదు. కళాకారులచే కళాజాతలతో అవగాహన కల్పిస్తున్నా ప్లాస్టిక్ వాడకం మాత్రం తగ్గడం లేదు. పెళ్లిళ్లకు, తదితర వేడుకలకు విచ్చలవిడిగా ప్లాస్టిక్ పేట్లు, గ్లాసులు వాడుతున్నారు. దీంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ దర్శనమిస్తోంది.

### ప్లాస్టిక్ రహిత దుబ్బాకగా తీర్చిదిద్దుదాం



ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. అలాగే కళాకారులచే కళాజాతాలు ప్రదర్శిస్తున్నాం. ఇక ముందు ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తప్పవు. దుబ్బాకను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రజలు కూడా సహకరించాలి.

- శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

# అక్రమ నీటి తరలింపును అరికట్టాలి

**ముదిరాజ్ సంఘం నాయకుల డిమాండ్**



చెరువులో వేసిన మోటార్లు

**మద్దూరు(హుస్నాబాద్):** దూల్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామం నల్ల చెరువు నుంచి అక్రమ నీటి తరలింపును అరికట్టాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా గ్రామంలోని నల్ల చెరువులో మోటార్లు పెట్టి నీటిని తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి చెరువులో చేప పిల్లలను వేశామని.. నీటిని తరలించడంతో చెరువులోని చేప పిల్లలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోటార్లు పెట్టడం ద్వారా విద్యుత్ షాక్‌కు గురై రోజుకు వందల సంఖ్యలో చేప పిల్లలు చనిపోతున్నాయని వాపోయారు. దీనిపై ఇరిగేషన్, మత్స్యశాఖ, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేసి తమ గోడును వెళ్లబోసుకున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా నీటి తరలింపును అరికట్టి ఆదుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.

# రైతులకు అదనపు పరిహారం ఇవ్వాలి

**దుబ్బాక:** మల్లన్నసాగర్ 4ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధిత రైతులకు అదనపు పరిహారం ఇవ్వాలని చీకోడ్ మాజీ ఎంపీటీసీ ఎల్.రాంరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా భూసేకరణ ప్రత్యేక ఉపకలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీకోడ్,దుబ్బాక రెవెన్యూ పరిధిలో కమ్మరపల్లి, అచ్చుమాయపల్లి గ్రామాల రైతులు సాగుచేసుకుంటున్న భూముల్లోంచి మల్లన్నసాగర్ 4ఎల్ కాల్వ వెళ్తుండటంతో రైతులు చాలా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులకు కేవలం నామమాత్రంగా పరిహారం అందించడం సరికాదన్నారు. సాగు నీటికోసం భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం ఎంత చేసినా తక్కువేనని, దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులకు అదనపు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు

**మద్దూరు(హుస్నాబాద్):** దూల్మిట్ట మండలం బెక్కల్ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మేలుకొలుపు, దీప్తికుంభంతో అర్చకులు బ్రహ్మోత్సవాలకు అంకురార్పన చేశారు. తొలి రోజు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో రామలింగేశ్వరస్వామి నామస్మరణతో క్షేత్రం మార్మోగింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ పార్నంది విశ్వనాథశర్మ, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అదేవిధంగా గుట్ట కింద పోచమ్మతల్లికి భక్తులు బోనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

# యూపీఎస్‌పై యుద్ధభేరికి తరలిరండి

**టీఎస్సీపీఎస్ఈయూ**

**దుబ్బాకరూరల్:** యూపీఎస్‌పై యుద్ధభేరిని విజయవంతం చేయాలని టీఎస్సీపీఎస్ఈయూ పిలుపునిచ్చింది. ఈ మేరకు మండలంలోని పెద్దగుండవెల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో టీఎస్సీపీఎస్ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురాకుల శ్రీనివాస్ బుధవారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ పథకంకు వ్యతిరేకంగా మార్చి 2న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో జరిగే యుద్ధభేరికి ఉపాధ్యాయ, ఉద్యోగులందరూ తరలిరావాలన్నారు. యూపీఎస్ పేరుతో ఉద్యోగుల భవిష్యత్తును కేంద్రప్రభుత్వం కార్పొరేట్లకు తాకట్టు పెడుతోందని దీనివల్ల ఉద్యోగుల జీవితాలు మరింత దుర్భరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూపీఎస్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని పాత పెన్షన్ విధానం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దేవరాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లీఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ‘తపాసుపల్లి’తో చెరువులు నింపండి

**చేర్యాల(సిద్దిపేట):** చేర్యాల ప్రాంతంలోని చెరువులను తపాసుపల్లి రిజర్వాయర్ నీటితో నింపాలని జేఏసీ చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ నీటి పారుదల శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంత రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం నిర్మించిన ఈ రిజర్వాయర్ నీటిని ఈ ప్రాంత రైతుల ప్రయోజనాలకే ఉపయోగించాలని కోరారు. ఇక్కడి రైతుల పొలాలను ఎండబెట్టి ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తే ఊరుకోమని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు ఆగంరెడ్డి, బీరయ్య, అశోక్, యాదయ్య, సత్యనారాయణ, లింగం, లక్ష్మీనారాయణ, భూమయ్య, భాస్కర్, నరేష్, రాజిరెడ్డి, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా పంటల నమోదు



పంటల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్

**దుబ్బాక:** యాసంగి సీజన్‌లో రైతులు వేసిన పంటలను డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా నమోదు చేస్తున్నట్లు దుబ్బాక మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. పంటల నమోదు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఏఈవోలు సర్వే నంబర్ల ఆధారంగా రైతు తన పొలంలో ఏ పంట వేశాడు? ఎంత విస్తీర్ణం, పంట రకం, నీటివనరులు తదితర వివరాలను యాప్‌లో నమోదు చేయడంతోపాటు ఆ పంట ఫొటోను తీసి అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. రైతుల వారీగా కచ్చితమైన వివరాలు లొకేషన్ ఆధారంగా సేకరిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఏఈవోలు తమ పొలానికి వచ్చినప్పుడు పంటల సాగు, బీడు భూముల వివరాలు సరిగ్గా చెబితే పంటలు అమ్ముకునే సమయంలో ఎలాంటి సమస్యలు రావన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సురేందర్,సంతోష్ తదితరులు ఉన్నారు.

## ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న ప్రిన్సిపాల్


**సిద్దిపేటఅర్బన్:** ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. డిప్లొమా మొదటి సంవత్సరంలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలుకుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ, డిప్లొమా కోఆర్డినేటర్ సుజిత్, వివిధ విభాగాల అధిపతులు, పీఆర్వో రఘు, నరేష్, సంతోషి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేబుల్ వైర్లు చోరీ

**తిగుల్ గ్రామంలో ఘటన**

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** ఘటన మండలంలోని తిగుల్‌గ్రామంలో బుధవారం బోరు బావుల నుంచి మోటార్ కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన 12 మంది రైతులు రాచకట్ట జలాశయం సమీపంలో బోరు మోటార్ల సహాయంతో వరి సాగు చేస్తున్నారు. తెల్లవారు జామున రైతులు పొలాల వద్దకు వెళ్లి చూసేసరికి మోటార్ల వైర్లు కట్‌చేసి ఉన్నాయి. కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గమనించిన రైతులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరురోజుల క్రితం ఇదే గ్రామంలో సుమారు 10మందికి చెందిన రైతుల మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురి కాగా గ్రామానికి చెందిన నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి వదిలిపెట్టారు. బుధవారం మళ్లీ చోరీ జరగడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**నంగునూరు(సిద్దిపేట):** ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు నంగునూరు ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎం రామస్వామి తెలిపారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు అలేఖ్య, వైష్ణవి, భరత్, కార్తిక్ అర్హత సాధించారని చెప్పారు.

# పాడి రైతులు బీమా చేయించుకోండి



ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ

**కొండపాక(గజ్వేల్):** పాడి రైతులు బీమాను చేయించుకోవాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాలాజీ సూచించారు. మండల పరిధిలోని దుద్దెడకు చెందిన పాడి రైతు మల్లేశం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో హెరిటేజ్ డెయిరీ సహకారంతో బుధవారం రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ పాడి రైతులు తప్పని సరిగా బీమాచేయించుకుని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో బీఎంసీ మేనేజర్ శ్రీకర్‌రెడ్డి, సూపర్ వైజర్ పరమేశ్వర్‌రెడ్డి, స్వయంభు శంభు దేవాలయ ట్రస్టు చైర్మన్ మంచాల శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో అభ్యర్థి రవీందర్

**సిద్దిపేటజోన్:** ఉమ్మడి మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గ పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థులు రవీందర్, మహమ్మద్ ముస్తాక్ అలీలు బుధవారం సిద్దిపేటలో ప్రచారం నిర్వహించారు. స్థానిక ముస్తాబాద్ చౌరస్తాలో విద్యుత్ కార్మిక సంఘం (1104) కార్యాలయం వద్ద, అలాగే.. స్థానిక ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ముస్తాక్ అలీ పాల్గొని తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

## సంక్షిప్త వార్తలు

◆ **సైబర్ నేరాలపై అవగాహన అవసరం**

**కొమురవెల్లి(సిద్దిపేట):** ఎన్నికలను అడ్డుపెట్టుకొని గొడవలకు దిగకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ రాజు సూచించారు. బుధవారం మండలంలోని గౌరయపల్లిలో సైబర్ నేరాలు, సీసీ కెమెరాలు, మత్తుపదార్థాలు, గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన ఉండాలని అన్నారు.

◆ **సాంకేతికతతో బోధన చేయాలి**

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** సాంకేతికతను వినియోగించుకుని బోధన చేయాలని ఎంఈఓ మాధవరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగదేవ్‌పూర్, గజ్వేల్ మండలాల ఆంగ్ల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లక్షలు వెచ్చించి పాఠశాలలకు పంపిణీ చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ తిరుపతిరెడ్డి, మహేందర్ రెడ్డి, నవీన్, కిరణ్, నర్మద పాల్గొన్నారు.

◆ **నేడు యూనియన్ బ్యాంక్ ప్రారంభం**

**వర్గల్(గజ్వేల్):** వర్గల్ మండలం తున్కిఖాల్సాలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖ గురువారం ప్రారంభమవుతుందని ఆ శాఖ మేనేజర్ సందీప్ హెచ్ నార్‌బాగ్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ కారె భాస్కరరావు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

◆ **సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత**

**దుబ్బాకరూరల్:** అక్బర్‌పేట భూంపల్లి మండలం చిన్ననిజాంపేటకు చెందిన మల్యాల రాజయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60వేలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, బాలు యాదవ్, కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, మధు పాల్గొన్నారు.

**మిరుదొడ్డి(దుబ్బాక):** నిరుపేదలకు సీఎం సహాయ నిధి గొప్ప వరం లాంటిదని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్ స్వామిగౌడ్ అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో చిన్న నిజాంపేట గ్రామానికి చెందిన మల్యాల రాజవ్వకు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కోనపురం బాలు యాదవ్, కార్యదర్శి ఏలూరి కమలాకర్, మాజీ ఎంపీటీసీ పాతూరి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మధు, శ్రీధర్, వెంకటేశం పాల్గొన్నారు.

◆ **ఉచిత వైద్య శిబిరం**

**దుబ్బాకరూరల్:** మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో లోహిత్‌సాయి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భాస్కర్, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **నర్సింహస్వామికి పూజలు**

**చిన్నకోడూరు(సిద్దిపేట):** మండల పరిధిలోని అల్లీపూర్ గుట్టల్లో వెలసిన ఉగ్ర నర్సింహస్వామి ఆలయ వార్షిరోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు చేసి హోమాలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

◆ **నష్ట పరిహారం ఇవ్వాలి**

**దుబ్బాకరూరల్:** మండలంలోని కమ్మర్‌పల్లి, చీకోడ్, అచ్చుమాయిపల్లి గ్రామాలకు చెందిన రైతులు మల్లన్న సాగర్ కాలువ నిర్మాణంలో తమ భూములను కోల్పోయారు. వారికి తగిన నష్టపరిహారం రాలేదని, అదనంగా ఇవ్వాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి కలెక్టరేట్‌లో భూసేకరణ విభాగం అధికారికి వినతి పత్రం అందజేశారు.

◆ **కరపత్రాల ఆవిష్కరణ**

**గజ్వేల్‌రూరల్:** ఎస్ఎఫ్ఐ జిల్లా 6వ మహాసభల నేపథ్యంలో కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ పోరాడుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజును నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని వివరించారు.

◆ **దూషించిన వ్యక్తిని అరెస్టు చేయాలి**

**కొమురవెల్లి(సిద్దిపేట):** కులం పేరుతో దూషించిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. చేర్యాల మండలంలోని చిట్యాల గ్రామంలోని మల్కని ఎల్లయ్యను కులంపేరుతో అదే గ్రామానికి చెందిన బోడుగం సురేందర్ రెడ్డి దూషించారు. అతనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరవై రోజుల క్రితం కేసు నమోదు చేసిన పోలీసులు అతనిపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి తోడు తనపై కేసు పెట్టిన వారిని చంపుతానని బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, జిల్లా నాయకులు మల్లేశం, దర్శనం రమేష్ పాల్గొన్నారు.

◆ **పరామర్శ.. ఆర్థిక సాయం**

**అక్కన్నపేట(హుస్నాబాద్):** అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామ బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. దశదినకర్మ ఖర్చుల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య రూ.25వేల చొప్పున రూ.50వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తుండగా బండరాళ్లు పైన పడి తల్లీకూతురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల మంత్రి బాధిత కుటుంబాలను పరామర్శించారు.